
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 కనిష్ఠం 13.6
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 16 నవంబరు 2025



లోక్ అదాలత్‌లో 1779 కేసుల పరిష్కారం

6

చిట్టి చేతులు.. చక్కని రాతలు

రాజీలేని పోరాటం చేస్తున్నాం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ
- జిల్లాకు చేరుకున్న పార్టీ 'వందేళ్ల' ప్రచార జాత

మరిన్ని వివరాలు 7వ పేజీలో...

భూభారతి అర్జీలను వేగంగా పరిష్కరించాలి

- అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, సాదాబైనామా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టిన చర్యల గురించి ఆరా తీశారు. పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, రెండు రోజుల్లో అర్జీలు పరిష్కారం కావాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం లక్ష్యం నెరవేరేలా అర త కలిగిన ప్రతీ దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. చిన్నచిన్న కారణాలతో సాదాబైనామా అర్జీలు తిరస్కరించకూడదని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు తు.చ తప్పకుండా అమలు చేయాలని, దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులను వెంటనే సబ్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాలకు ఫార్వర్డ్ చేయాలని ఆదేశించారు. కాగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాల మ్యాపింగ్ ను తప్పిదాలకు తావు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ముగిసిన కోదండ రామ స్వామి బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో కోదండ రామ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజున ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, కోదండ రామ స్వామి సీతాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అయితే పూజల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

అంతకుముందు, ధ్వజస్తంభం ప్రతిష్ఠతో పాటు కోదండ రామ స్వామి సీతా సమేత కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, గోవిందా గోవిందా.. జైశ్రీరామ్ జైశ్రీరామ్.. సీతారాం.. అంటూ భక్తుల నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య కార్యక్రమం సాగింది. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో కోదండ రామ స్వామి సీతా సమేత కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డాక్టర్ భూపతి రెడ్డితో పాటు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణ కర్తలు వారిని ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా ధర్మారం(బి) గ్రామంలోని కలగర కుటుంబ వాస్తవ్యులు నిర్మించిన కోదండ రామస్వామి గుడి ధర్మారం భక్తులతో పాటు ఇతర గ్రామాలకు కొంగు బంగారంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాదర్, డీసీసీ కార్యదర్శి ధర్మ గౌడ్, శివరామకృష్ణ, కలగర రామకృష్ణ, కలగర బాబి, నానేష్, గొట్టిపాటి వాసు, త్రిపురనేని సాయి బాబా, రావుల బ్రహ్మానందం నాయుడు, ఆంజనేయులు, చట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ మంత్రి మండవ

సమీక్షలు షురూ..



- ప్రభుత్వ సలహాదారు హోదాలో జిల్లాలోని పెండింగ్ పనులపై సమీక్షించిన సుదర్శన్‌రెడ్డి
- క్యాబినెట్ హోదాలో మొదటిసారి కలెక్టరేట్‌లోని మంత్రి చాంబర్‌లో సమీక్షలు
- రెండేళ్ల తర్వాత జిల్లాకు దక్కిన క్యాబినెట్ హోదా



నిజామాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా.. జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో జిల్లాలోని పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయి. అడపాదడప ఇన్‌చార్జి మంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నా.. నిరంతర పర్యవేక్షణ లేక జిల్లా అభివృద్ధి కుంటుపడింది. 2023 డిసెంబరులో మొదటిసారి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ క్యాబినేట్‌లో జిల్లాకు మంత్రి పదవి వస్తుందని ఆశపెట్టుకున్నా.. సమీకరణల దృష్ట్యా సాధ్యం కాలేదు. గత ఆరు నెలల క్రితం రెండవసారి మంత్రివర్గ విస్తరణ చేసినా.. జిల్లాకు మంత్రి పదవి దక్కలేదు. ఇటీవల జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో అజారుద్దీన్‌కు మైనార్టీ కోటాలో మంత్రి పదవి ఇచ్చినపుడు సైతం మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, జిల్లాకు మంత్రి పదవి వస్తుందని ఆశ ఉన్నప్పటికీ.. కేవలం ఒక్కరితోనే మంత్రివర్గ విస్తరణ చేశారు. ఉమ్మడి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో జిల్లా అధికారులు ఆశించిన స్థాయిలో పనిచేయకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి పథకాలపై ఆ ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి క్యాబినేట్ హోదాతో కూడిన ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ సలహాదారులకు లేని ప్రత్యేకలతో కూడిన జీవోను ప్రభుత్వం ఇచ్చింది. క్యాబినేట్ హోదాతో పాటు మంత్రి మండలి సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరవడం, మంత్రులతో సమానంగా ప్రాధాన్యం ఇస్తూ జీవో ఇచ్చారు. ఈ నేపథ్యంలో మొదటిసారి జిల్లాకు వచ్చిన సుదర్శన్‌రెడ్డి సమీక్షలతో జిల్లాలోని పెండింగ్ పనులను శనివారం జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షించారు. జిల్లా నూతన కలెక్టరేట్‌లో గత ప్రభుత్వ హయాంలో ఉన్న మంత్రి ఛాంబర్‌లో రెండేళ్ల తర్వాత అధికారులతో సమీక్షించడం ఇదే మొదటిసారి. ఇన్‌చార్జి మంత్రులు, ఇతర మంత్రులు ఆ చాంబర్‌ను వినియోగించుకునేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జిల్లాలోని పెండింగ్ పనులతో పాటు ఇటీవల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల విషయంలో నిర్లక్ష్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. గురువారం జరిగిన సుదర్శన్‌రెడ్డి సన్మాన సభలోనూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ జిల్లాకు మంత్రి సుదర్శన్‌రెడ్డి అంటూ బహిరంగ సభలో ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత కొద్దికాలంగా జిల్లాకు మంత్రి లేని లోటును తీరుస్తూ క్యాబినేట్ హోదాతో కూడిన ప్రభుత్వ సలహాదారు హోదాలో సుదర్శన్‌రెడ్డి సమీక్షలతో జిల్లా అభివృద్ధిని పరుగులుపెట్టించేందుకు శ్రీకారం చుట్టారు.

ఆర్‌వోబీలు, పంటనష్టంపై సుదీర్ఘ సమీక్ష

గత కొద్దికాలంగా జిల్లాలో నిధులులేక పెండింగ్‌లో ఉన్న మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జితో పాటు అడవి మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్,

(తరువాయి 8వ పేజీలో....)

రెండేళ్లుగా జిల్లాకు లేని మంత్రి పదవి

రాజకీయంగా చైతన్యం ఉన్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు గత రెండేళ్లుగా మంత్రి పదవిలేదు. గతంలో ఉన్న ప్రభుత్వాల హయాంలో ఎప్పుడు కూడా జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకుండా ఉండడం ఇదే మొదటిసారి 2004 ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు, ఒక స్పీకర్ ప్రాతినిధ్యం వహించిన చరిత్ర ఉంది. అప్పుడు దివంగతనేత డి.శ్రీనివాస్, షబ్బీర్‌అలీ, సంతోష్‌రెడ్డిలు మంత్రివర్గంలో ఉన్నారు. కేఆర్ సురేష్‌రెడ్డి స్పీకర్‌గా ఉన్నారు. ఆ తర్వాత 2009 ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో ఒకే స్థానం నుంచి గెలుపొందిన సుదర్శన్ రెడ్డి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014 తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పడిన ప్రభుత్వంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నారు. 2019 ప్రభుత్వంలో బాల్కొండ శాసనసభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రిగా, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్‌గా పనిచేశారు. 2023 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉమ్మడి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యంలేకుండా పోయింది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన సాగుతున్నాయి. అభివృద్ధి పనులపై సమీక్షించేవారే లేకపోవడంతో అధికారులు సైతం తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు. ఇన్‌చార్జి మంత్రిగా మొదట జూపల్లి కృష్ణారావు ఉండగా.. అడపాదడప సమీక్షలు నిర్వహించారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క నియామకం కాగా.. ఇప్పటి వరకు ఒకేసారి జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రెండేళ్లుగా జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి పదవి లేకపోవడంతో ప్రతిపక్షాలు సైతం విమర్శించారు. ఇన్‌చార్జి మంత్రుల సమీక్షలు లేక, జిల్లాకు మంత్రి లేక జిల్లా అభివృద్ధి కుంటుపడుతున్న తరుణం లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ప్రభుత్వం క్యాబినేట్ హోదాతో కూడిన ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. రెండేళ్లుగా ఉమ్మడి జిల్లా ప్రజలు మంత్రి పదవి కోసం ఎదురుచూస్తుండగా అదే హోదాలో సుదర్శన్‌రెడ్డికి ప్రభుత్వ సలహాదారుగా నియమించడం అభివృద్ధి పనులపై సమీక్షించే అవకాశం కల్పించినట్లైంది.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం
- ఆర్‌వోబీలకు నిధులు విడుదల చేసినట్లు వెల్లడి



సుభాష్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ఆర్‌వోబీ పనుల పురోగతి, ధాన్యం కొనుగోళ్లు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. నిజామాబాద్ రూరల్ మండలం మాధవనగర్, మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి, నిజామాబాద్ అర్బన్ పరిధిలోని అర్సపల్లి ఆర్‌వోబీల నిర్మాణ పనులపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌వోబీల నిర్మాణాల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిధులను సైతం విడుదల చేసిందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. మాధవనగర్ ఆర్‌వోబీకి రూ.3.15 కోట్లు, అర్సపల్లి ఆర్‌వోబీ పనుల కోసం రూ.7.46 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు రవాణా పరంగా మరింత సౌలభ్యం కలిగేలా పనులను సకాలంలో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, పనులను సకాలంలో పూర్తి చేయకుండా అలసత్వం ప్రదర్శించే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. నిర్దేశిత గడువును ఏర్పరుచుకుని యుద్ధప్రాతిపదికన పనులను చేపట్టి పూర్తి చేయించేలా చొరవ చూపాలని అధికారులకు హితవు పలికారు. అడివిమామిడిపల్లి వద్ద బీటీ రోడ్డు, తదితర పనులను పూర్తి చేసి, డిసెంబరు 15 నాటికి వంతెనను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. కాగా, జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంత రైతులు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరి పైరు నీట మునిగి పంట దెబ్బతిన్నందున బాధిత రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. రంగు మారిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ తనిఖీల ఎఫెక్ట్

- మూసిఉన్న దస్తావేజులేఖరి కార్యాలయాలు
- రిజిస్ట్రేషన్ అధికారులను పిలిపించుకుని వివరాలు తెలుసుకున్న అధికారులు



మూసిఉన్న దస్తావేజు లేఖరి కార్యాలయాలు

సుభాష్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారుల తనిఖీలతో కార్యాలయం వెలవెలబోయింది. ఉదయం నుంచి ఉద్యోగులతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకునే వారు లేకపోవడంతో కార్యాలయ ప్రాంగణం మొత్తం ఖాళీగా కనిపించింది. ఏసీబీ అధికారుల భయంతో జిల్లా కేంద్రంలోని కవిత కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న దస్తావేజుల దుకాణాలు మొత్తం మూసి ఉన్నాయి. ఒక్కరు కూడా తెరిచి లేకపోవడంతో శనివారం ఒక్కస్లాట్ కూడా బుక్ కాలేదు. శనివారం మొత్తం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాలేవు. ఉద్యోగులు సైతం అరకొరగానే హాజరయ్యారు. ఉన్న ఉద్యోగులు ఒక్కచోట చేరి కాలం వెల్లదీశారు. ఏసీబీ అధికారులు శనివారం మరోసారి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి మరికొన్ని దస్తావేజులను తీసుకెళ్లినట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్‌ను సైతం ఏసీబీ కార్యాలయానికి పిలిపించుకున్నారు. మధ్యాహ్నం ఏసీబీ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్‌ను పిలిపించుకుని విచారించారు. సబ్ రిజిస్ట్రార్ ఇతర అధికారులు లేకపోవడంతో కార్యాలయం మూగబోయింది.

రాహుల్‌గాంధీని కలిసిన పీసీసీ చీఫ్




నిజామాబాద్ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమా ర్ గౌడ్ ఢిల్లీలో కలిశారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంపై వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమా ర్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను రాహుల్‌గాంధీ అభినందించారు.

కార్పొరేషన్‌లో.. సర్వర్ మొరాయింపు



- నిలిచిపోయిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ
- వెయ్యికి పైగా పెండింగ్‌లో దరఖాస్తులు
- సర్టిఫికెట్ల కోసం బల్దియా చుట్టూ తిరుగుతున్న జనం



నిజామాబాద్ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అంతరాయం కలిగింది. సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల కోసం నగరవాసులు ప్రతీరోజు బల్దియా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గత వారం రోజులుగా పనులు కావడం లేదు. సర్టిఫికెట్ల ప్రక్రియలో జాప్యానికి కారణం సర్వర్ డౌన్ అని కార్యాలయం సిబ్బంది చెబుతున్నారు.

వారం రోజులుగా సర్వర్ జామ్..

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ గత వారం రోజులుగా నిలిచిపోయింది. సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన వెబ్ సైట్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నా యి. దీంతో గత గురువారం నుంచి సర్వర్‌లో మరమ్మతులు చేయడం లేదంటున్నారు. అలాగే అవసరమైన సర్టిఫికెట్ల కోసం నగరవాసులు నిత్యం బల్దియా చుట్టూ తిరుగుతున్నారు.

పెండింగ్‌లో వెయ్యికిపైగా దరఖాస్తులు

బల్దియాలో దాదాపు వెయ్యి వరకు సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయినట్లు తెలిసింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రా ల జారీ, పేర్లలో కరెక్షన్లు(తప్పుల సవరణ) వంటివి ప్రతీరోజు 200 నుంచి 250 వరకు దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. దాంతో గత వారం రోజుల నుంచి సర్టిఫికెట్ల జారీ పనులు జరగడం లేదు. దాంతో ఇప్పటి వరకు దాదాపు వెయ్యికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా యి. అత్యవసరంగా సర్టిఫికెట్ల

(తరువాయి 8వ పేజీలో....)

నగరంలో ప్రధాన బస్టాండ్ పరిశీలన

సుభాష్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ ప్రదాన బస్టాండ్‌ను కార్పొరేట్ చీఫ్ ఇంజనీర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. శనివారం బస్టాండ్ ప్రాంగణం మొత్తం కలియతిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భవనాల గోడలు, పైకప్పులు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రయాణికుల విశ్రాంతి గదులు, టికెట్ కౌంటర్, తదితర ముఖ్య విభాగాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం సీసీఈ కవిత మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యాలు, భద్రత, పరిశుభ్రతకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు. భవనం పాడైపోయినచోట వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఆర్టీసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులకు అధికారులకు తెలిపారు. ఆమె వెంట నిజామాబాద్ ప్రాంతీయ అధికారి జ్యోత్స్న, డిపో మేనేజర్‌లు ఆనంద్, తదితరులు ఉన్నారు.



పరిశీలిస్తున్న ఆర్టీసీ కార్పొరేట్ చీఫ్ ఇంజినీర్ కవిత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో రాజశ్రీ
- వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశం

సుభాష్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. జిల్లాకేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీసీడీనాట్ జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ప్రతీ స్కానింగ్ కేంద్రం తప్పకుండా పీసీ డీనాట్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ అయి ఉండాలని తెలిపారు. స్కానింగ్ యంత్రాల మోడల్, సీరియల్ నెంబర్ ధ్రువపత్రాలలో నమోదు చేయాలన్నారు. వైద్యుడు గాని, చిరునామా గాని మారితే తప్పకుండా ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలియజేసి ధ్రువపత్రాలను మార్చుకోవాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చేవారి కోసం తాగునీటి సదుపాయం, శౌచాలయం ఏర్పాటు చేయాలని అన్నారు. రెఫరల్ పత్రం లేకుండా స్కానింగ్ చేయరాదన్నారు. అన్ని వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నూతనంగా ఒక స్కానింగ్ సెంటర్‌కు రెన్యూవల్ కోసం సలహా సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రసన్న, డాక్టర్ దీప్తి, డాక్టర్ ఇందు, డాక్టర్ శ్వేత, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శిఖర, డీహెచ్‌ఈ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

పాఠశాల బస్సు కిందపడి క్లీనర్ దుర్మరణం

సుభాష్‌నగర్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): నగరంలోని అర్సపల్లి ప్రాంతంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు కిందపడి క్లీనర్ మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఆరో టౌన్ ఎస్ఐ వెంకట్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ బస్సును రివర్స్ తీసుకునే సమయంలో క్లీనర్ కిషన్(44) బస్సు టైరు కింద పడి ఘటన స్థలంలోనే మృతిచెందినట్లు తెలిపారు. కిషన్‌భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

నవీపేట,నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని ఎస్సారెస్పీ గోదావరి బ్యాక్ వాటర్‌లో ప్రమాదవశాత్తు మునిగి పెరిగే చిన్న సాయిలు(51)అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్సై తిరుపతి తెలిపారు. మాక్లూర్ మండలం ముత్యంపల్లికి చెందిన చిన్న సాయిలు శుక్రవారం నందిపేట మండలం తల్వేదలో తన బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి వెళ్లాడన్నారు. అదే రోజు సాయంత్రం పక్కనే ఉన్న తన అత్తగారి గ్రామం నాళేశ్వర్‌కు వెళ్లాడని, శనివారం ఉదయం కాలకృత్యాల కోసం తల్వేద బ్రిడ్జి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వైపు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు వివరించారు. మృతుడి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

దూదిగాంలో మృతదేహం లభ్యం

ఏర్గట్ల, మెండోర 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూదిగాంలో శనివారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. మృతుడికి 50 ఏళ్లు ఉంటాయని, నీలి రంగు చొక్కా, తెల్లటి గడ్డం ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు మెండోర పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

మూడు ఆలయాల్లో దొంగతనం

మోపాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు ఆలయాల్లో ఒకేరోజు దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నర్సింగ్‌పల్లిలోని పెద్దమ్మ గుడి తాళాలు పగలగొట్టి విగ్రహంపై ఉన్న తులం బంగారం పుస్తెలు దొంగిలించుకుపోయారు. అలాగే సిర్పూర్ తండా సేవాలాల్ ఆలయంలో తులం బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయారు. గుడితండాలోని సేవాలాల్ ఆలయంలోనె బంగారు ముక్కుపుడక, తులం బంగారం, వెండి ఆభరణాలు అపహరించినట్లు స్థానికులు మోపాల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై సుష్మిత సంఘటనాస్థలాన్ని పరిశీలించి దొంగతనంపై ఆరాతీశారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరిస్తున్నారు. ఒకేరోజు మూడు గ్రామాల్లోనే ఉన్న ఆలయాల్లోనే దొంగతనం జరగడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో పోలీసులు గస్తీ తిరుగుతున్నా దొంగతనాలు జరుగుతుండటంతో మండలంలో భయాందోళనకు గురవుతున్నారు. మూడు ఘటనలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుష్మిత వివరించారు.

గంజాయి పట్టివేత.. ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసి, అతడి నుంచి 260 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం రాత్రి బాబాసాహెన్‌పహాడ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా గంజాయి అమ్ముతున్న అమీర్‌ఖాన్‌ను పట్టుకున్నామన్నారు. అతడి నుంచి గంజాయితో పాటు బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అమీర్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్సై నరసింహాచారి, సిబ్బంది భోజన్న, విష్ణు, భూమన్న, సాయికుమార్, శ్యాంసుందర్, అవినాశ్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్గలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

బోధన్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): కొప్పర్గలో చిన్న సాయిలు అనే రైతు పొలం నుంచి శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి వాటిలోని పరికరాలను చోరీ చేశారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. రైతు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

లోక్ అదాలత్‌లో 1,779 కేసుల పరిష్కారం

నిజామాబాద్ లీగల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో 1779 పైగా కేసులను పరిష్కారించినట్లు న్యాయసేవా అధికార సంస్థ ఇన్చార్జి కార్యదర్శి పి.సాయిసుధ తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో 229 క్రిమినల్, 1550 ఎస్‌టీసీ కేసులు పరిష్కారించారు.

బోధన్: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా అదనపు న్యాయమూర్తి వరుధిని అన్నారు. శనివారం బోధన్ న్యాయస్థానంలో వివిధ కోర్టులో 708 కేసులు పరిష్కారం అయ్యాయని వివరించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఖాజానాకు జరిమానాల రూపంలో రూ.13,06,999 జమ అయ్యాయన్నారు.

చిట్టి చేతులు.. చక్కని రాతలు

- కలానికి పదును పెడుతున్న విద్యార్థులు
- కవితలు, కథా రచనలో రాణింపు
- అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో బహుమతులు
- పలు పుస్తకాల ఆవిష్కరణ

12 పుస్తకాల ప్రచురణ..

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వ హిస్తున్న ప్రవీణ్‌శర్మ విద్యార్థులకు కథలపై, కవిత్వంపై, పద్యాలపై ఆసక్తిని పెంచారు. వారితో కథలు, కవితలు రాయించి చిగురు బాలశతకం, నవ కవనం, బాల కథా తరంగాలు, చదువు, బంగారు బాల్యం, ముద్దబంతి, బుడత శతకం, కవి నాయక వినాయక, పాదార్పన, నేను కథ రాస్తానోచ్, చిగురు కొమ్మ ఇలా 12 పుస్తకాలను ప్రచురణ చేశారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి కథ, కవితల పోటీల్లో పాల్గొనేలా చేసి, వారితో అనేక బహుమతులు గెలిచేలా కృషి చేశారు.



విద్యార్థులు రాసిన కథల పుస్తకాలు

చిట్టి చేతులు.. తమ మెదడుకు పదునుపెట్టి కలాలతో అక్షరాలు జాలువారుస్తున్నాయి. చక్కటి కవితలు రాసేస్తున్నాయి.. చిట్టిపదాలతో కథలు చెప్పేస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తూ అవార్డులు అందుకుంటున్నాయి. ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో పుస్తకాలు సైతం రూపొందిస్తున్నాయి. ఇలా ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు ఆధ్వర్యంలో విద్యార్థులు రచనల్లో రాణిస్తున్న అంశాలు వారి మాటల్లోనే.

- ఏర్గట్ల

జాతీయస్థాయిలో బహుమతులు సాధించా...



గతేడాది నుంచి సాహిత్యపరమైన అన్ని పోటీల్లో పాల్గొంటున్నా. ఇప్పటి వరకు నాకు జాతీయ స్థాయిలో మూడు, రాష్ట్ర స్థాయిలో మూడు బహుమతులు గెలుపొందాను. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సాహిత్య పరిషత్, పురిమెళ్ళ ఫౌండేషన్ వారి జాతీయ స్థాయి కథల పోటీల్లో బహుమతులు పొందాను. త్వరలో కథల పుస్తకాన్ని అవిష్కరించబోతున్నా. - **అభిలాష్, 10వ తరగతి**

21 కథలతో అమ్మమ్మ ప్రేమ



నేను 8వ తరగతి నుంచి కథలు, కవితలు రాస్తున్నాను. మా తెలుగు పండితుడు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో వీటిని నేర్చుకున్నా. జాతీయస్థాయి, రాష్ట్ర స్థాయిలో బహుమతులు గెలుపొందాను. ఈ మధ్యనే రిమెళ్ల ఫౌండేషన్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీల్లో నేను రాసిన మంచి మనసు కథకు నాకు బహుమతి వచ్చింది. ఇప్పుడు మరో 21 కథలతో అమ్మమ్మ ప్రేమ అనే పుస్తకాన్ని తీసుకొస్తున్నా. - **శ్రీనిధి, 9వ తరగతి**

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..



ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కథలు, కవితలు రాయడం నేర్చుకున్నాను. తెలంగాణ సాహిత్య పరిషత్ జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో నేను రాసిన కథకు ఉత్తమ బహుమతి లభించింది. మా చిరాజు బాలసాహిత్య పీఠం వారు నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీల్లో చెట్టు ప్రేమ కథకు బహుమతి లభించింది.

- రాజేష్, 8వ తరగతి

సంతోషంగా ఉంది..



బాల్యం ఆధ్యాత్మికంగా, సాహిత్య పరంగా రాణించేందుకు అనుకూలంగా ఉంటుంది. విద్యార్థుల్లో ఎంతో సృజనాత్మకత దాగి ఉంటుంది. వారిలో సాహిత్య పరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో విద్యార్థులతో కథలపై, కవిత్వంపై, పద్యాలపై ఆసక్తి పెంచుకొని రాణిస్తున్నారు. అంత ర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటూ అనేక ప్రశంసలు, బహుతులు గెలుస్తున్నారు. నాకు చాలా సంతోషంగా ఉంది. - **ప్రవీణ్ శర్మ, తెలుగు పండితుడు**



కళాశాలలో వివరాలు తెలుసుకుంటున్న డీఐఈవో రవికుమార్

మంచి ఫలితాలు వచ్చేలా చూడాలి

కమ్మర్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్నాయని విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తూ, పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఐఈవో రవికుమార్ అధ్యాపకులను ఆదేశించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలకు సంబంధించిన వివిధ రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ధర్పల్లి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, కమ్మర్‌పల్లి ప్రిన్సిపాల్ జయపాల్‌రెడ్డి, అధ్యాపకులు మధుకుమార్, గంగాధర్, శ్రీహరి వెంకటేష్, మహేందర్, గంగారాం,మురళీకృష్ణ తదితరులున్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

ఏర్గట్ల, మెండోర 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాకురి శ్రీనివాస్ సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టర్ ద్వారా గుర్తించి బాధితులకు సెల్‌ఫోన్‌ను శనివారం మెండోర ఎస్సై సుహాసిని అందజేశారు. ఎవరి ఫోన్‌నైనా చోరీకి గురైతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కనిపెట్టి అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

అభివృద్ధిలో రాజీ పడేదే లేదు

▸▸ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాను ప్రతిపక్షంలో ఉన్నా అభివృద్ధి పనులు చేయడంలో రాజీ పడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తన స్వగ్రామమైన వేల్పూర్‌లో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ తన నిధుల నుంచి మంజూరు చేసిన రూ.1.30 కోట్లతో నిర్మించనున్న పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇవే కాకుండా మినీ స్టేడియంలో ఇండోర్ స్టేడియం నిర్మాణ నిమిత్తం రూ.35లక్షలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల నిర్మాణ నిమిత్తం రూ.25 లక్షలు, ముదిరాజ్ సంఘ భవనానికి రూ.20 లక్షలు, చర్చి, మసీదుల నిర్మాణాలకు నిధులు వచ్చాయన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తరపున మాజీ ఎంపీ సంతోష్ కుమార్‌కు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, ఎంఈవో రేణుక, తహసీల్దార్ శ్రీకాంత్ ఏఎంసీ చైర్మన్ నర్సారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను వదులుతున్న ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

▸▸ ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని జానకంపేట శివారులోని అశోక్‌సాగర్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి చేప పిల్లల పంపిణీని ప్రారంభించారు. చెరువులో చేప పిల్లలను వదిలారు. మత్స్యకార కుటుంబాల ఉపాధి కల్పించేందుకు నాణ్యమైన చేపపిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామన్నారు. మత్స్య అభివృద్ధి పథకం కింద 2025-2026 సంవత్సరానికి వంద శాతం సబ్సిడీపై చెరువులు, రిజర్వాయర్‌లలో చేప పిల్లను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 4.54కోట్ల చేపపిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ రాజిరెడ్డి, మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఆంజనేయస్వామి ఉన్నారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్ల డ్రైవ్ ప్రారంభం

కమ్మర్‌పల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రానున్న విద్యాసంవత్సరానికి అడ్మిషన్లకు శనివారం మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో కళాశాల అధ్యాపక బృందం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించింది. ఈ సందర్భంగా మండలంలోని ఉప్లూర్, హసాకొత్తూర్, ఏర్గట్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తూ కళాశాలలో విద్యార్థుల కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటే ప్రభుత్వం నుంచి భవిష్యత్తులో అందే ప్రయోజనాలను, ఉచిత పాఠ్యపుస్తకాలు, మినరల్‌వాటర్, క్రమశిక్షణతో అందించే విద్యాబోధన, వారంతపు పరీక్షలు, రోజూ స్టడీ అవర్స్ గురించి తెలియజేశారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా విదాబోధన చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం



విద్యార్థులకు కళాశాలలో కల్పించే సదుపాయల గురించి కరపత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు

చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మధుకుమార్, గంగాధర్, శ్రీహరి వెంకటేష్, మహేందర్, గంగారాం, మురళీకృష్ణ, స్వాతి, స్రవంతి పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష చాలా పవిత్రమైనది

బోధన్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష చాలా పవిత్రమైనదని, నియమ నిష్ఠలతో ఉండి పూజలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాటు తహసీల్దార్ విఠల్ అయ్యప్ప స్వాములకు స్వయంగా భిక్షను వడ్డించారు. 15సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములకు నిత్య భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న అయ్యప్ప సేవా ట్రస్టు సభ్యులను ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభినందించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు



అయ్యప్ప స్వాములకు వడ్డిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ శర్మ, అయ్యప్ప సేవా ట్రస్టు కార్యదర్శి చక్రవర్తి, అన్నదాన నిర్వాహకులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, పావులూరి వెంకటేశ్వర్ రావు, బ్రహ్మయ్యగౌడ్, ప్రసాద్, రమేష్ ఉన్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి

నవీపేట,నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో పలు చోట్ల వరిపంట రంగు మారిందని, సంబంధిత ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చూడాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు రాష్ట్ర ప్రభుత్వ సలహదారు సుదర్శన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహానికి రైతులు వెళ్లారు. రంగు మారిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసే విధంగా చూడాలని వారు కోరారు. బాధిత రైతులకు తగిన న్యాయం చేస్తామని సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానికేశ్వర్ రావు, మనోహర్ రావు, నాగన్న, దేవేందర్, సతీష్ ఉన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న నవీపేట మండల రైతులు

విద్యుత్ అధికారుల పొలంబాట

ముప్కాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యం లో శనివారం రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధి కారులు రైతులు పొలాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, లైన్‌మెన్లు నవీన్, లక్ష్మణ్, గణపతి, మల్లేష్, సత్యం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



పొలంబాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

బోధన్‌లో ఎంఐఎం సంబురాలు

బోధన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలో ఎంఐఎం ఐదు ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకోవడంతో పాటు జూబ్లీహిల్స్ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందిన సందర్భంగా బోధన్‌లో ఎంఐఎం నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోధన్ ఎంఐఎం మీర్ ఇలియాస్ అలీ మాట్లాడుతూ.. బిహార్ శాసనసభ ఎన్నికలలో ఎంఐఎం ఐదు ఎమ్మెల్యే స్థానాలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఎంఐఎం పార్టీ మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందడం రాబోయే ఎన్నికలకు శుభ సూచికమన్నారు. రానున్న ఎన్నికలలో ఎంఐఎం అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు హైమద్ బిన్ మొసిన్, ఖదీర్ ఖాన్, హాజీ బిల్డర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఐఎం కార్యాలయంలో సంబురాలు దృశ్యం



కారోబార్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో

ఇంటి పన్ను త్వరగా వసూలు చేయాలి

డొంకేశ్వర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు చేయడంలో వేగవంతం చేయాలని ఎంపీవో ప్రవీణ్ మండల కారోబర్‌లను ఆదేశించారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో ప్రవీణ్ మండల కారోబర్‌లతో సమావేశం శనివారం నిర్వహించారు. వంద శాతం పన్ను వసూలు పూర్తి చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కారోబర్లు రంజిత్ గౌడ్,స్వామి, నరేష్, రమేష్, నాగస్వామి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సుదర్శన్‌రెడ్డికి సన్మానం

రెంజల్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుగా నియమితులై జిల్లాకు వచ్చిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు కలిశారు. కాంగ్రెస్ రెంజల్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో జావీదోద్దీన్, కలీం బేగ్, సాయిరెడ్డి, రవి, సిరాజ్ బేగ్, పుర్‌ఖాన్, అబేద్ ఉన్నారు.

క్రీడాస్ఫూర్తితో జీవితంలో రాణించాలి

ఏర్గట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రీడాస్ఫూర్తితో జీవితంలో రాణించాలని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. శనివారం మెండోర మండలంలోని అంతర్ పాఠశాలల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో గెలిచిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్వేష్, రాజ్‌కుమార్, నరేందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి

యువజన సంరక్షణ క్లబ్ ఏర్పాటు

కమ్మర్‌పల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారంబాలిక సాధికారత, యువజన సంరక్షణ క్లబ్ ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం రాంప్రసాద్ తెలిపారు. ఈ క్లబ్ ఆధ్వర్యంలో కౌమార దశలో విద్యార్థులలో వచ్చే మార్పులు ఆరోగ్య పరిశుభ్రత, ఆర్థిక అక్షరాస్యత, న్యాయ అక్షరాస్యత, డ్రగ్స్ వ్యతిరేక పోరాటం, మానసిక ఆరోగ్యం, స్వీయరక్షణ, జీవన నైపుణ్యాలు, కెరీర్ గౌడెన్స్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాఅధికారులు, వివిధ రంగాలలో ప్రావీణ్యం పొందినవారిని గెస్టు లెక్చరర్‌లుగా నియమిస్తారని తెలిపారు. క్లబ్ కన్వీనర్‌గా రామకృష్ణ, మహిళ సభ్యురాలిగా గీత, క్లబ్ సభ్యులుగా హర్షిత్, మోక్ష, గౌతం, రష్మీత, శ్రీకాంత్ , అక్షి , హీరారామ్, వర్షిణి, రిశ్వంత్, రిత్వీక ఏడాది పాటు సేవలందిస్తారని ప్రధానోపాధ్యాయుడు వివరించారు.

ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలి

నవీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో నీట మునిగి దెబ్బతిన్న పంటకు ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం అందించేలా చూడాలని పలువురు బాధిత రైతులు సీపీఐ నాయకులకు వినతిపత్రం అందజేశారు. బాసర నుంచి ఖమ్మం వరకు చేపట్టిన సీపీఐ ప్రచార జాత శనివారం మండలంలోని యంచకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు రైతులు సీపీఐ నాయకులను కలిశారు. గోదావరి వరదలతో మండలంలోని కోస్లీ, మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, నందిగామ, బినోల, నిజాంపూర్, తుంగిని, నాళేశ్వర్ గ్రామాలలో సుమారు 4వేల ఎకరాలలో వరిపంట దెబ్బతిందని వారు పేర్కొన్నారు. బోధన్, రెంజల్ మండలాలలో వరితో పాటు సోయా, పత్తి, పొగాకు వంటి పంటలు గోదావరి వరదలతో నీట మునగడంతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఈ ఈ విషయంపై సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు శాసనసభలో రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా చూడాలని వారు కోరారు. ఆయన దృష్టికి సమస్యను తీసుకెళ్తామని నాయకులు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజీవ్, లాలు యాదవ్, సాయన్న, జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

భీమ్‌గల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే వేములు ప్రశాంత్ రెడ్డి శనివారం పరామర్శించారు. 4వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బోయి అశోక్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించి రూ.10 వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. పార్టీ నాయకుడు నవీన్, భగత్‌ల తాత ఇటీవల మరణించడంతో వారిని కలిసి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



విద్యార్థులకు బహుతులను అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ విఘ్నేశ్వర్

బహుమతుల అందజేత

ముప్కాల్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలకేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం, బాలల దినోత్సవాన్ని శనివారం ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించి మంచి ప్రతిభను కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విఘ్నేశ్వర్, ప్రిన్సిపల్ విజయకృష్ణన్, పాఠశాల పర్యవేక్షకులు రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లయ్య చెరువు పరిశీలన



ఎల్లయ్య చెరువును పరిశీలిస్తున్న జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు

బాన్సువాడటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎల్లయ్య చెరువును శనివారం జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఇటీవల బీజేపీ నాయకులు ఎల్లయ్య చెరువుకు సంబంధించిన కాల్వలు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహాయకుడికి ఫిర్యాదు అందించారు. ఈ విషయమై స్పందించిన అధికారులు, జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు ఎల్లయ్య చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు సమగ్ర సర్వే చేపడతామన్నారు. ప్రభుత్వం కబ్జాలపై ఉక్కుపాదం మోపుతోందని, ఎవరైనా కబ్జా చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, ప్రసాద్, పాశం భాస్కర్‌రెడ్డి, వెంకట్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



బాన్సువాడలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు పంతాలకు పోయి సాధించేది ఏమిలేదని, రాజీ మార్గమే రాజమార్గమని బాన్సువాడ జడ్జి కుమారీ టీఎస్పీ భార్గవి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్‌అదాలత్‌తో కక్షిదారులు సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవచ్చన్నారు. అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఖలీల్, మొఘులయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఎస్‌ఆర్‌పీ ప్రదీప్‌కుమార్

బీర్కూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రూ.2.76 కోట్ల ఉపాధిహామీ పనులు చేపట్టారు. అయితే ఈ పనులపై సామాజిక బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టనుంది. ఈ నెల 15 నుంచి 23 వరకు గ్రామాలలో తిరిగి తనిఖీలు చేపట్టనున్నారు. ఈ మేరకు బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్‌ఆర్‌పీ ప్రదీప్‌కుమార్ గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, డీఆర్‌పీలు, వీఎస్‌ఏలు పాల్గొన్నారు. సామాజిక తనిఖీ ఎలా చేపట్టాలి అనే దానిపై తనిఖీ బృందానికి ఎస్‌ఆర్‌పీ ప్రదీప్ కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ భానుప్రకాష్, ఏపీవో అక్మల్, తనిఖీ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



బీర్కూర్‌లో మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అన్ని విధాలుగా అభివృద్ధి సాధ్యం అవుతుందని రాష్ట్ర సెర్ప్ సీఆర్‌పీలు దుర్గ, సంగీత అన్నారు. శనివారం బీర్కూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో గ్రామసంఘం పదాధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉల్లాస్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారాలన్నారు. చదువు రాని వారికి చదువు నేర్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమం తెచ్చిందన్నారు. దీని ద్వారా సంఘ సభ్యులు సంతకాలు చేయడం, ఆర్థిక అక్షరాభ్యాస్యం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎంపీడీవో

పిట్లం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రఘు లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ప్రభాకర్, హనుమంతరావు, కార్యదర్శి సమద్, పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 35వ వార్డు హశాస్నాబాద్ కాలనీలో పలు అభివృద్ధి పనులను మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సడాక్ వినోద్ శనివారం ప్రారంభించారు. రూ.13 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కలిగోట శ్రీనివాస్, సడాక్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

ఆర్మూర్ టౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. పార్టీని ఆదరించి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించినందుకు అక్కడి ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చౌరస్తాలో టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, శ్రీనివాస్, పండిత్ పవన్, వెంకట్ రాంరెడ్డి, ప్రసాద్, వినోద్, విజయ్ అగర్వాల్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటం చేస్తున్నాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

నవీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) కార్మికుల, కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగింపు ఉత్సవాల సందర్భంగా బాసర నుంచి ఖమ్మం వరకు చేపట్టిన ప్రచార జాత మొదటి రోజైన శనివారం నవీపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. రాచరికానికి, నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా సీపీఐ పోరాటం చేసిందని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాంను గద్దె దించడానికి జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణత్యాగాలతో 3వేల గ్రామాల విముక్తి, 10లక్షల ఎకరాల భూమిని పంచిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని ఆమె వివరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. అంతకు ముందు మండల కేంద్రంలో అంబేద్కర్, భగత్‌సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వలి ఉల్లా ఖాద్రీ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డీజీ నరేంద్ర ప్రసాద్, సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, జిల్లా కార్యదర్శి సుధాకర్, జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి తదితరులున్నారు.



నవీపేటలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

సీపీఐ కష్టజీవుల పార్టీ

నిజామాబాద్ సిటీ: సీపీఐ కష్టజీవుల పార్టీ అని, బడుగు బలహీనవర్గాలత తరఫున, వారి హక్కుల కోసం గత వందేళ్లుగా ప్రజా పోరాటాలుచేస్తోందని రాజ్యసభ మాజీసభ్యుడు అజీజ్ పాషా అన్నారు. శనివారం సీపీఐ వందేళ్ల పండగ సందర్భంగా ప్రచార జాత బాసర నుంచి ప్రారంభమై శనివారం మధ్యాహ్నం నిజామాబాద్ నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్సపల్లి నుంచి గాంధీగంజ్ వరకు భారీర్యాలీ నిర్వహిం సభ ఏర్పాటుచేశారు. హాజరైన మాజీ రాజ్యసభ ఎంపీ అజీజ్ పాషా మాట్లాడారు. కాంగ్రెస్ తరువాత వందేళ్లు పూర్తి చేసుకున్న పార్టీ కేవలం సీపీఐ మాత్రమేనన్నారు. దేశంలో ఎన్నో పార్టీలు ఆవిర్భవించాయి, అందులో చాలా పార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. ప్రజల సమస్యల మీద, ప్రజల హక్కుల కోసం నిర్విరామంగా పోరాటాలు చేస్తూ ప్రజల ఆదరణ పొందిన పార్టీల్లో సీపీఐ ప్రముఖమైనదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, వలి ఉల్లాఖాద్రి, డీజీ నరేంద్ర ప్రసాద్, ఉప్పలయ్య, ఓమయ్య, జిల్లా నాయకులు పి.సుధాకర్, రాజేశ్వర్, రాజన్న, స్వరూప రాణి, రఘురాం, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ పాషా

అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై పీడీ యాక్ట్



జైలు అధికారులకు భాస్కర్‌బాపురావు చావన్‌ను అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై, గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులు కృష్ణబాబు షిండే, నామ్‌దేవ్, రాథోడ్ అజిత్ రమేష్‌లపై ఇదివరకే పీడీయాక్ట్ నమోదు చేయగా శనివారం మరో ప్రధాన నిందితుడు భాస్కర్‌బాపురావు చావన్‌పై సైతం పీడీయాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై పుష్పరాజు, గాంధారి ఎస్సై ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ నర్సింలు నిజామాబాద్ జైలు అధికారులకు భాస్కర్‌బాపురావు చావన్‌ను అప్పగించారని తెలిపారు. ప్రజలకు హాని కలిగించేలా నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నాగిరెడ్డిపేట విద్యార్థిని

నాగిరెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెట్‌బాల్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నాగిరెడ్డిపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని ఎల్లవ్వ ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు శనివారం మండలంలోని చీనూర్ గ్రామానికి చెందిన మీరాతాయి ఎంపికైన విద్యార్థినికి ట్రాక్ సూట్, షూస్ బహూకరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన క్రీడాకారిణి ఎల్లవ్వకు ఆర్థికపరమైన సహాయం అందిస్తామని ఆమె తెలిపారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినితో పాటు పలువురు క్రీడాకారిణులను, పీఈటీ నబాత్ కృష్ణను గ్రామస్థులు సన్మానించారు.



విద్యార్థినికి ట్రాక్ సూట్, షూస్ అందజేస్తున్న దృశ్యం

రైతు ఖాతా నుంచి రూ.96వేలు మాయం

బీర్కూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు సైబర్ నేరానికి గురై రూ.96 వేలు పోగొట్టుకున్న ఘటన బీర్కూర్ మండలంలో జరిగింది. వివరాలు.. మండలంలోని చించోల్లి గ్రామానికి చెందిన రైతు బీర్కూర్ శ్రీనివాస్ ఫోన్‌కు ఈ నెల 13వ తేదీన ఆధార్ అప్డేట్‌కు సంబంధించిన ఓ మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లో ఏముందో చూద్దామని ఓపెన్ చేశాడు. అక్కడే ఓ లింక్‌కనిపించగా దానిని క్లిక్ చేశాడు. దీంతో ఆ ఫోన్ నంబర్‌తో లింక్ అయి ఉన్న తన బ్యాంకు ఖాతాలో నుంచి గంటల వ్యవధిలో రెండు దఫాల్లో రూ.96వేలు మాయం అయ్యాయి. దీంతో అదే రోజు ఆ రైతు బ్యాంకు అధికారులను సంప్రదించాడు. లింక్‌ను ఓపెన్ చేయడం వలన డబ్బులు కట్ అయినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఈ విషయమై శనివారం బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.



పాస్‌బుక్ చూపిస్తున్న శ్రీనివాస్

సీపీఎం కార్యకర్తకు నివాళి



సంతాపం తెలుపుతున్న సీపీఎం నాయకులు

బోధన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణానికి చెందిన సీపీఎం సీనియర్ కార్యకర్త కిష్టగౌడ్ శుక్రవారం రాత్రి మృతి చెందారని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. ఆయన మృతి బోధన్‌లో పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో మృతదేహానికి పార్టీ ఆధ్వర్యంలో ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని పార్టీ క్రమశిక్షణతో నిబద్ధతగా పనిచేస్తూ పార్టీ నిర్ణయాలను అమలుపరచడంతో పాటు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయసిద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ మేరకు కిష్టాగౌడ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం పాటలు పాడుతూ నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు గంగాధరప్ప, వెంకట్రాములు, శంకర్ గౌడ్, గంగాధర్, వెంకట సుజాత తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో కార్తీక పూజలు

భిక్కనూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శనివారం అర్చకులు స్వామిని తీరొక్క పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మండపంలో సత్యనారాయణ వ్రతాలు, కార్తీకదీపాలను వెలగించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, చైర్మన్ శ్రీధర్, వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి, సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు.



సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

కారోబార్‌ను తొలగించాలని డిమాండ్



హంగర్గలో మాట్లాడుతున్న ఎంపీడీవో చందర్

కోటగిరి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామ పంచాయతీ కారోబార్ హన్మాండ్లును విధుల నుంచి తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హంగర్గ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో చందర్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కారోబార్ గత కొంతకాలం నుంచి విధులు నిర్వర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని, ఇందిరమ్మ ఇళ్లకు ఇళ్ల నెంబర్ల కేటాయింపుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు పలువురు ఆరోపించారు. పంచాయతీ యూనియన్ నాయకులు కారోబార్ విషయంలో అధికారులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పంచాయతీ కార్యదర్శికి, కారోబార్‌కు మధ్య సమన్వయ లోపం ఏర్పడడం వల్లే సమస్య వచ్చిందని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయమై స్పందించిన ఎంపీడీవో కారోబార్ విషయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాల అందజేత



మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో రాజా శ్రీనివాస్

కమ్మర్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను శనివారం కమ్మర్‌పల్లిలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ .. ఇళ్ల మంజూరులో చూపిన చొరవ నిర్మాణ విషయంలోనూ చూపాలని లబ్ధిదారులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సూచించారు. నిర్మాణపనుల్లో జాప్యం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు రుణాలు అందజేసేలా వెసులుబాటు కల్పించిందని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చూడాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిమ్మ రాజేంద్రప్రసాద్, సల్లూరి గణేష్ గౌడ్, సింగిరెడ్డి శేఖర్, బుచ్చిమల్లయ్య, దూలూర్ కిషన్ గౌడ్, పంచాయితీ కార్యదర్శి జమున, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

గాంధారి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండివేట్ గ్రామంలో ఎరువుల గోదాంలను ఏవో రాజలింగం ఏఈవోలతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం తిమ్మాపూర్‌లో వరికొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. విండో సీఈవో కృష్ణారెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.



ఎరువులను పరిశీలిస్తున్న దృశ్యం

పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు సన్మానం

రామారెడ్డి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో హైదరాబాద్‌లో కామారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను శనివారం కలిసి సన్మానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మెజార్టీ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.



మహేష్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మానసిక ఆరోగ్యంపై అవగాహన

రాజంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో అనుకున్న లక్ష్యాలు నెరవేర్చుకోవాలంటే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మోటివేషన్ స్పీకర్ బండారి సంజీవులు తెలిపారు. రాజంపేట మండలంలోని ఆర్గొండ, బస్వన్నపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఆరోగ్యకరమైన, సానుకూల జీవనశైలిని అనుసరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అర్గొండ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న మోటివేషన్ స్పీకర్ సంజీవులు

ముగిసిన వీరభద్ర స్వామి ఆలయ ఉత్సవాలు



అగ్నిగుండంలో నడుస్తున్న మహిళలు

మద్నూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత 3 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగిన వీరభద్ర స్వామి ఆలయ ఉత్సవాలు శనివారం తో ముగిశాయి. గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వందలాది భక్తులు తరలి వచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు భక్తి భావన, సాంప్రదాయ, ఆచారవ్యవహారాలతో జరిగాయి. శనివారం తెల్లవారు జామున ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అగ్ని గుండంలో భక్తులు నడిచి తమ భక్తిని చాటు కున్నారు. ముందుగా ఆలయ అర్చకులు సం ఘయ్యప్ప స్వామి కుటుంబ సభ్యులతో అగ్ని గుండంలో నడక ప్రారంభించగా ఆయన వెం ట భక్తులు వందలాదిగా నడిచారు. మొదటి రోజు నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల భజనలు, హారతు లతో శ్రీ వీరభద్ర స్వామిని చేరుకొని పాడిపం టలు బాగుండాలని కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండాలంటూ మొక్కులు తీర్చుకు న్నారు. సాయంత్రం గ్రామంలో వీరభద్ర స్వామి దంపతుల పల్లకీ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో వందలాది మంది భక్తులు హాజరై వీరభద్రేశ్వరశ్వర స్వామికి జై అంటూ నినాదాలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేపట్టారు.



గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామి పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

I, EX NO:13894962F,NK M.VENKATESHWER RAO, R/O H.NO: 1-11/26/2, NEAR BLN GARDEN, NIZAMABAD, TS. IN MY SERVICE RECORD MY NAME WRONGLY MENTIONED AS M.VENKATESHWER RAO S/O M.VIJAY RAO AND HENCE CORRECT NAME IS MUMMANENI VENKATESHWAR RAO S/O M. VIJAY RAO VIDE AFFIDAVIT NO: 35AA 945866,DATE:26-09-2025

AJZ

CHANGE OF NAME

I, EX NO:13894962F,NK M.VENKATESHWER RAO, R/O HNO:1-11/26/2,NEAR BLN GARDEN, NIZAMABAD, TS IN MY SERVICE RECORD MY WIFE NAME WRONGLY MENTIONED AS M.SREE DEVI AND HENCE CORRECT NAME IS MUMMANENI SRIDEVI W/O MUMMANENI VENKATESHWAR RAO VIDE AFFIDAVIT NO:35AA 945866,DATE:26-09-2025

AJZ

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి
దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు...
క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు రూ. 190/-
అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని, ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453

సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ


చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సలహాదారు సుదర్శన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. జిల్లాకేంద్రంలోని నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి తొలిసారిగా విచ్చేసిన సుదర్శన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికి శాలువా బోకేలతో సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు నాశెట్టి సుమన్, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుదర్శన్‌రెడ్డికి జ్ఞాపికతో సత్కరించారు. సుదర్శన్‌రెడ్డిని కలిసిన వారిలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రశాంత్, శ్రీనివాస్, ప్రభు, టీఎన్‌జీవోస్ ప్రధాన కార్యదర్శి శేఖర్, సహ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు శివకుమార్, సంయుక్త కార్యదర్శి జాఫర్ హుస్సేన్, అర్బన్‌కమిటీ సభ్యులు జాకీర్ హుస్సేన్,మారుతిప్రకాష్, స్వామి, సుధాకర్ తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


మాట్లాడుతున్న ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ నరసింహారెడ్డి

జక్రాన్‌పల్లి, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని డీఈవో అశోక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీసత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ జిల్లా డైరెక్టర్‌గా తిరుపతిరెడ్డిని నియమించగా నియామకపత్రాన్ని ట్రస్ట్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, డీఈవో అశోక్ అందజేశారు. విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు విలువలతో కూడిన విద్యను అందుతుందన్నారు. అనంతరం దాత చిట్టాపూర్ గ్రామానికి చెందిన దయానంద్‌రెడ్డి సహకారంతో ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివా స్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ గంగాజమున, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి రవిన్, ప్రదానోపాధ్యాయురాలు స్నేహలత, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మలావత్ పూర్ణ కుటుంబాన్ని ఆదుకుంటాం

▸▸ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


మలావత్ పూర్ణ తండ్రి దేవీదాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మలావత్ పూర్ణ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఉద్యోగం ఇప్పించడానికి తన వంతుగా ప్రయత్నం చేస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి భరోసా కల్పించారు. ఇటీవల పూర్ణ తండ్రి దేవిదాస్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని శనివారం మండలంలో పాకాల గ్రామంలో నివాసముంటున్న పూర్ణ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి, ధైర్యం చెప్పారు. కుటుంబ పెద్ద లేడని, దిగులు చెందకుండా ధైర్యంగా ఉండాలని పూర్ణను ఓదార్చారు. పూర్ణ తండ్రి ఆసుపత్రి సంబంధిత ఖర్చులు అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ మలావత్ మాన్‌సింగ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవి, డీసీసీ కార్యదర్శులు వెల్మ భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, నాయకులు మహేందర్, సంతోష్, బాల్‌రాజ్ నాయక్, శివాజీ నాయక్, నరేష్, సాయన్న తదితరులున్నారు. పోతున్నార్ మాజీ సర్పంచ్ నర్సయ్య ఇటీవల మరణించగా.. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

సారంగపూర్ బీఈడీ కాలేజీలో వ్యవసాయ వర్సిటీ తరగతులు

నిజామాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా మంజూరయిన వ్యవసాయ విశ్వవిద్యాలయ తరగతులను తాత్కాలికంగా సారంగపూర్ బీఈడీ కళాశాలలో నిర్వహించనున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాయాన్ని డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో నెలకొల్పాలని అధికారులు నిర్ణయించారు. అయితే వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అవసరమైన స్థల సేకరణ ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. దాంతో విద్యాసంవత్సరానికి అంతరాయం కలగకుండా ప్రస్తుతానికి సారంగపూర్‌లోని బీఈడీ కళాశాలలో తాత్కాలిక తరగతులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. సారంగపూర్‌లోని బీఈడీ కళాశాలకు దాదాపు 50 ఎకరాల స్థలం ఉంది. ఇందులో ప్రస్తుతానికి బీఈడీ, ఎంఈడీ కోర్సులు జరుగుతున్నాయి.

బాధితులకు పరామర్శ

ఇందల్వాయి, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని అధైర్య పడవద్దని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సిర్నాపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగాధర్ తల్లి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి స్వయంగా ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.


సీతారామ, లక్ష్మణుల వేషధారణలో విద్యార్థులు


తిలకిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

రాముడిది ధర్మమార్గం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామాయణంలో రాముడు గొప్పగా అభివర్ధించడానికి కారణం రాముడు ధర్మంవైపు నిలబడ్డాడని ప్రేమ్ నారాయణ మహారాజ్ ప్రవచనం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఉమామహేశ్వర కమ్యూనిటీ హాల్‌లో రెండవ రోజు నిర్వహించిన రామకథా ప్రవచనంలో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. వాల్మీకి రచించిన రామాయణంలో ప్రతీ ఒక్క పాత్ర మనకు జీవితంలో ఎలా ఉండాలో నేర్పించిందని అన్నారు. రాముడు ధర్మంవైపు ఉండి తన భార్యను సైతం అడవులకు పంపి ధర్మస్థాపనకు కృషి చేశాడని అన్నారు. రాజు ఎలా ఉండాలో ప్రజలను ఎలా పరిపాలించాలో నేటి పాలకులకు మార్గదర్శకాన్ని చూపారని కొనియాడారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేసినప్పుడే రామరాజ్య స్థాపన జరుగుతుందని, అందుకు ప్రతి ఒక్కరు రామచరిత్రను మరింత లోతుగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. రామాయణం భారతదేశానికే కాకుండా వివిధ దేశాల్లో పాలించే పాలకులకు ఒక గొప్పనైన గ్రంథం అని అన్నారు. రామకథ ప్రవచనం జరిగినంత సేపు విద్యార్థులు రామకథను కళ్లకు కట్టినట్లు చూపెట్టారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ఆద్యాంతం రామకథను విన్నారు. ఈ కార్యక్రమంలో రాంస్వరూప్ దాలియా, వల్లబ్ సర్దార్‌జీ, అనిల్ కదం, దినేష్ ఠాకూర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రవచిస్తున్న ప్రేమ్ నారాయణ మహరాజ్

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ

సుభాష్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయిలో క్రీడలలో రాణించాలని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని క్రీడా అథారిటీ స్విమ్మింగ్‌లో జరిగిన అభినందన సభలో ఏసీపీ మస్తాన్ అలీ మాట్లాడారు. క్రీడల ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో వికారాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బాలికల విభాగంలో వినమ్ర 200 మీటర్ల ఫ్రీ స్టైల్ పందెంలో వ్యక్తిగత రజత పతకం, 400 మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. బాలుర విభాగంలో మోహన్ దుర్గా 200 మీటర్ల, ఫ్రీ స్టైల్ 400 మీటర్లు విభాగంలో రెండు కాంస్య పతకాలు సాధించారు. అఖిల్‌చారి 50 మీటర్ల బటర్ఫ్లై, 200 మీటర్లు బట్టర్ ఫ్లై విభాగంలో కాంస్య పతకాలు సాధించాడు. క్రీడాకారిటీ ఆధ్వర్యంలో విద్యార్థులను పతకాలు, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో పవన్ కుమార్, స్విమ్మింగ్‌పుల్ కోచ్ ఫారుక్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డీడబ్ల్యూవో రసూల్‌బీ

సుభాష్‌నగర్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని పారదోలేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ, మహిళ శిశు సంక్షేమ అధికారి రసూల్ బీ పిలుపునిచ్చారు. ఎయిడ్స్, పొగాకుపై అంగన్‌వాడీ టీచర్లకు జిల్లా ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును జిల్లాకేంద్రంలోని గూపన్‌పల్లిలో గల స్వామి వివేకానంద ధ్యాన మందిరంలో శనివారం నిర్వహించగా.. ముఖ్యఅతిథులుగా డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీడబ్ల్యూవో రసూల్ బీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసనగా చలో ఢిల్లీ


పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సుభాష్‌నగర్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి నిరసనగా ఈ నెల 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు గందమాల నాగభూషణం, సరికెల పోశెట్టి, నాంపల్లిలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గవాయిపై దాడి జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. వెంటనే దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, మాదిగ ఉద్యోగస్థుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, గంగారాం, పోచిరాం, కిష్టయ్య, రమేష్, రాములు, సుజిత్, పద్మ పాల్గొన్నారు.

ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

సిరికొండ, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులు బాగా చదివి అత్యధిక మార్కులు సాధించాలని డీఐఈవో రవికుమార్ సూచించారు. సిరికొండలోని మోడల్ స్కూల్‌ను ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రయోగ శాలను, గ్రంథాలయాన్ని, పాఠశాలలోని మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల వద్దకు వెళ్లిన విద్యాధికారి విద్యార్థుల అభ్యాసనను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ఇప్పటి నుంచి అభ్యాసనను మొదలు పెట్టాలని కోరారు. బాగా చదివి అత్యధిక మార్కులు సాధించి జిల్లాకు, సిరికొండ మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని ఆయన కోరారు. ఆయన వెంట ప్రిన్స్‌పాల్ గడ్డం రాజేష్‌రెడ్డి, ధర్పల్లి జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

సమీక్షలు షురూ...

(5వ పేజీ తరువాయి...)

అర్సపల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జ్ పనులపై సుదర్శన్‌రెడ్డి సమీక్షించారు. ఇటీవలి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నిదులు ఇవ్వడంలేదని ఎంపీ అరవింద్ దీక్షకు దిగుతానని చెప్పడం, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టివిక్రమార్కను కలిసి నిదులు విడుదలపై వినతిపత్రం ఇవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మొదటిసారి ప్రభుత్వ సలహదారు హోదాలో సుదర్శన్‌రెడ్డి పెండింగ్ పనులపై సమిక్షించారు. మాదవనగర్ ఆర్‌వోబితో పాటు అడవిమామిడిపల్లి, అర్సపల్లి ఆర్‌వోబిల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని అధికారులకు స్పష్టం చేశారు. పనులు సకాలంలో పూర్తిచేయని కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్టులో పెడతామని ఆయన హెచ్చరించారు. అదేవిదంగా ఇటీవల కురిసిన వర్షాల వల్ల గోదావరి పరివాహక ప్రాంత రైతుల వరిపంట మునిగిపోగా.. సమగ్ర నివేదిక రూపొందించి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలోనూ వర్షాల వల్ల రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సంక్షేమ పథకాల సలహదారుగా ఉన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల స్కీంలపై సైతం సమీక్షించారు.

ఫుట్‌బాల్ కోచ్ నాగరాజుకు అవార్డు

సుభాష్‌నగర్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ ప్రతిభను పెంపొందించడంలో విశేషంగా కృషిచేసిన వారికి ఇచ్చే అన్‌సంగ్ గురు అవార్డు జిల్లాకు చెందిన ఫుట్‌బాల్ కోచ్ నాగరాజుకు వరించింది. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఫుట్‌బాల్ కోచ్ ఇన్ ఇండియాలో కలకత్తాలో శనివారం నిర్వహించే ఈ అవార్డుల కోసం కోచ్ నాగరాజుకు ఆహ్వానం పంపింది. కలకత్తాలో ఫుట్‌బాల్ కోచ్‌ల సమైక్య ఆధ్వర్యంలో కోచ్ నాగరాజుకు అవార్డును ఇవ్వనున్నారు. ఫుట్‌బాల్ క్రీడాప్రాచుర్యాన్ని విశిష్టతను పెంపొందించడంతో పాటు అంకితభావంతో శిక్షణ ఇస్తున్నందుకు ఈ అవార్డు నాగరాజుకు అందజేయనున్నారు. జిల్లాకు చెందిన అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి, భారతజట్టు క్రీడాకారిణి సౌమ్యకు చిన్ననాటి నుంచి ఫుట్‌బాల్ మెలకువలు నేర్పారు. సౌమ్యతోపాటు అనేక మంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ అందించారు.

ఘనంగా వేంకటేశ్వరుడి పల్లకీసేవ


పల్లకీకి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలు భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీసేవను కొండపై చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సంజీవ్‌గౌడ్, బ్రాహ్మణపల్లి సొసైటీ ఛైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గదుల కొరత తీరుస్తా..

▸▸ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

సిరికొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూంపల్లి ప్రాథమిక పాఠశాలలో గదుల కొరతను తీర్చడానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి హామీఇచ్చారు. మండలంలోని తూంపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలను కలియ తిరిగి గదుల కొరత ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, అందుకనుగుణంగా గదులు లేవని ప్రధానోపాధ్యాయుడు శంకర్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాల సమస్యలపై డీఈవోతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. తాత్కాలింగా షెడ్ల ఏర్పాటు చేయించాలని డీఈవో ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఎర్రన్న, రవి, భాస్కర్‌రెడ్డి, నరేష్, మహేందర్, దేవరాజ్, రాజేశ్వర్‌గౌడ్, వినోద్, శ్రీకాంత్ పాల్గోన్నారు.



సహకార వారోత్సవాల్లో పాల్గొన్న మానాల

మోపాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు అన్ని రకాల పంటలు పండించి మరింత ఆర్థిక అభివృద్ధి చెందాలని టీజీసీయూ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న మాపల్లె ఆర్గానిక్ ఫార్మింగ్ ఫార్మర్స్ సర్వీస్ మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాల కార్యక్రమాన్ని సొసైటీ చీఫ్ ప్రమోటర్ నర్సింహారెడ్డి, ఛైర్మన్ జి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానాల మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రామ రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతో వివిధ రకాల పంటలను పండించడం అభినందనీయమని కొనియాడారు. మిగతా రైతులు కూడా గ్రామ రైతులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ గ్రామ రైతులందరూ సమైక్యతతో ఉండి పంటలు పండించుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డీసీవో ఎన్.శ్రీనివాస్‌రావు, సంఘ డైరెక్టర్లు, సహకార శాఖ అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని చంద్రశేఖర్ కాలనీలోని ప్రాంతీయ గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. రెండో రోజున గ్రంథాలయ ప్రాంగణంలో వివిధ పుస్తకాలను ఉంచి పుస్తకాల పఠనం చేయడంతో కలిగే ప్రయోజనాలను గ్రంథాలయ అధికారి బుగ్గారెడ్డి వివరించారు. పుస్తక ప్రదర్శనతో విద్యార్థులకు ఏ పుస్తకాలు రాశారో అందులో విషయాలను తెలుసుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పొందిన వారు అవుతారన్నారు. అనంతరం విద్యార్థులకు కవి సమ్మేళనం, రచయితల పరిచయం వంటి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ గ్రంథపాలకులు మధు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న పాఠకులు

కార్పొరేషన్‌లో.. సర్వర్ మొరాయింపు

(5వ పేజీ తరువాయి...)

జారీ కోసం ప్రతీరోజు బల్దియా చుట్టూ వందల సంఖ్యలో నగరవాసులు చక్కర్లు కొడుతున్నారు. ఇంకా ఎన్ని రోజులు తిరగాలి అని సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.

రాష్ట్రవ్యాప్త సమస్య..

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి చెందిన సర్వర్ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయినట్లు తెలిసింది. కేవలం నిజామాబాద్ కార్పొరేషన్ ఒక్కటే కాకుండా తెలంగాణ అంతటా ఇదే సమస్య ఎదురవుతోంది. ఇప్పటికైనా అధికారులు సర్వర్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

బర్త్ సర్టిఫికెట్‌కు వారం నుంచి తిరుగుతున్నా..

మా మనుమరాలికి సంబంధించిన బర్త్ సర్టిఫికేట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాం. సర్టిఫికెట్ జారీ కోసం బల్దియా చుట్టూ తిరుగుతున్నా పనులు కావడం లేదు. ఇప్పుడు సర్వర్ పనిచేయడం లేదని చెబుతున్నారు. అత్యవసరమైన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

- హన్మాండ్లు, ముబారక్‌నగర్.

కమిషనర్ దృష్టికి తీసుకువచ్చాం

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సర్వర్ డౌన్ అయ్యింది. ఎర్రర్ వస్తోంది. గత వారం రోజుల నుంచి ఈ సమస్య ఎదురవుతోంది. మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. సర్టిఫికెట్ల కోసం వచ్చే వారికి నచ్చచెబుతున్నాం. అర్జంట్ అవసరమున్నవారి మాత్రం వాగ్వాదానికి దిగుతున్నారు. అటువంటి వారికి సమస్యను వివరిస్తున్నాం. ఆన్‌లైన్ పనులు కాకుండి ఇతర పనులను చేస్తున్నాం.

- విజయ్ కుమార్, బర్త్, డెత్ సెక్షన్ ఇన్‌చార్జి

‘ఉగ్రవాదంపై భారత్ పోరు’ వ్యాసరచన పోటీలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. ఉగ్రవాదంపై భారత్ పోరు అనే అంశంపై విద్యార్థులకు పోటీ నిర్వహించగా.. వివిధ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం ఎన్నికలు యువత అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా ఉపన్యసించారు. ప్రొఫెసర్ కుమారస్వామి, రిటైర్డ్ డిగ్రీ కళాశాల లైబ్రెరియన్ వీరప్రసాద్, రిటైర్డ్ ప్రొఫెసర్ భుజంగం, అధ్యాపకులు రాజేంద్రప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవ హరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రెరియన్ రాజారెడ్డి, అసిస్టెంట్ లైబ్రెరియన్ తారకం పాల్గొన్నారు.

నేడు జనరల్ నాలెడ్జ్ పోటీలు...

గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు గ్రంథాలయ ప్రాంగణంలో పోటీలు జరుగనున్నాయి.

సినిమా గైడ్


దేవి	: కాంత (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: మాస్‌జాతర (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కాంత (10.30, 1.30, 4.40, 7.40, 10.30)
స్క్రీన్-2	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.00, 1.40, 7.30)
	: దేదే ప్యార్‌దే- (హిందీ) (4.30, 10.30)
స్క్రీన్-3	: శివ(రీరిలీజ్) (11.00, 1.40, 4.40, 7.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: దేదే ప్యార్‌దే- (హిందీ) (10.00)
	: కాంత (1.05, 7.20, 10.40), ది గర్ల్‌ఫ్రెండ్ (4.25)
స్క్రీన్-2	: కాంత (10.10)
	: దేదే ప్యార్‌దే- (హిందీ) (1.30, 7.50, 10.55)
	: సంతానప్రాప్తిరస్తు (4.35)
స్క్రీన్-3	: శివ (రీరిలీజ్) (10.00), లవ్ ఓటిపి (1.05)
	: కాంత (4.20), ది గర్ల్‌ఫ్రెండ్ (7.40, 10.35)
స్క్రీన్-4	: సి మంతం (12.35), గోపిగాళ్ల గోవా ట్రిప్ (3.00)
	: సీతా ప్రయాణం కృష్ణతో (5.20)
	: ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో (8.10)
	: శివ (రీరిలీజ్) (10.40)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,26,700	రూ.1,17,200	రూ.1650

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	రూ.150	రూ.260	రూ. 280

